ముంపు సమస్య త్వరలో పరిష్కరిస్తాం

- ఆర్డీఓ దాసి రాజు వెల్లడి
- కలెక్టర్ ఆదేశాలతో యండగండిలో డ్రెయిన్ పరిశీలన


కోలమూరు శివారులో ముంపునకు గురయ్యే వరి పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో దాసి రాజు

ఉండి : యండగండి, ఉప్పులూరు గ్రామాలకు చెందిన రైతులు ఏళ్లతరబడి ఎదుర్కొంటున్న కష్టం త్వరలోనే తీరిపోనుంది. కొద్దిపాటి వర్షాలకే ఏటా యండగండి మీడియం డ్రెయిన్ ఉప్పొంగడం వలన ఉప్పులూరు, యండగండి గ్రామాల పరిధిలో సుమారు ఆరు వందల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని ఉప్పులూరు రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆర్డీవో దాసిరాజును ఆదేశించారు. ఈమేరకు గురువారం ఆర్డీవో దాసిరాజు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రైతుల సమక్షంలో యండగండి మీడియం డ్రెయిన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూడిక పనులు జరగకపోవడమే సమస్యకు కారణమని గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే డ్రెయిన్ ఆధునికీకరణ పనులు, పూడిక తొలగింపు కోసం ఇరిగేషన్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారని, వాటికి అనుమతులు కూడా లభించాయని అన్నారు. వెంటనే డ్రెయిన పూడిక పనులు ప్రారంభిస్తామని ఆర్డీవో దాసిరాజు రైతులకు తెలిపారు. డ్రెయిన్ పూడిక తీసిన మట్టిన లేఅవుట్లు పూడ్చేందుకు వాడే అవకాశం కూడా ఉందన్నారు. కాబట్టి రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరు గ్రామ సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, ఇరిగేషన్ ఏఈ ఏవీ వెంకటేశ్వరరావు, తదితర రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

1 నుంచి బొండాడలో అమ్మవార్ల జాతర


బొండాడలో అమ్మవార్ల జాతరకు పందిరి గుంజ నాటుతున్న దృశ్యం

కాళ్ల: బొండాడలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల జాతర మహోత్సవాలు మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స రంగరాజు చెప్పారు. ఈ సందర్భంగా గురువారం అమ్మవార్లకు పందిరాట ముహూర్తం రావడంతో ఆలయం వద్ద పందిరి వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల అమ్మవార్లను పూరిగుడిసెలో పెట్టే సందర్భంగా గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. అమ్మవార్ల జాతర ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాదిలో కూడా మరింత వైభవంగా జాతరను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో వేగేశ్న ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, మన్నే శ్రీనివాస్, కందుల హనుమ, మేకా వెంకన్నబాబు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎలుకల బెడదతో దిగుబడికి ముప్పు

ఆకివీడు: ఎలుకల బెడద రబీ సాగులో అధికంగా ఉంటుందని, వీటి నిర్మూలనకు సామూహిక పద్ధతుల్ని పాటించాలని ఏడీఏ కేఏఎస్ఎస్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద గురువారం సామూహిక ఎలుకల నిర్మూలనపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సాగులో చేలల్లో నీటి శాతం తక్కువగా ఉంటుందని, ఎలుకలు చేలల్లో విస్తృతంగా తిరిగే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో వరి కాండం, పొట్ట దశలో వరి మొక్కల్ని కొరికి తింటాయని చెప్పారు. సామూహిక ఎలుకల నిర్మూలన పద్ధతుల్ని చేపట్టడంద్వారా వాటి నివారణకు మార్గం ఏర్పడుతుందన్నారు. ముందుగా రైతులు ఎలుకల బొరియల్ని గుర్తించి, వాటి వద్ద బ్రొమోడయోలోన్ మందును కలిపి ఉంచాలన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో అన్ని గ్రామాల్లోని వరి చేలల్లో ఎలుకల నిర్మూలన కార్యక్రమాల్ని విస్తృతంగా చేపట్టాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎమ్మార్పీ ప్రియాంక, డీఈసీ ఏడీఏ సీహెచ్.శ్రీనివాస్, ఏఓ కాశీమాతలు మాట్లాడుతూ విషపు ఎర తయారీ విధానాన్ని వివరించారు. సామూహిక ఎలుకల నిర్మూలనకు రైతులు, ఆర్బీకే ఇన్‌చార్జిలు, సిబ్బంది సహకరించాలని సూచించారు.

25 నుంచి వేండ్ర రైల్వే గేటు మూత

పాలకోడేరు: వేండ్ర రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం ముందు ప్రకటించిన ప్రకారం కాకుండా ఈ నెల 25 తేదీ ఉదయం 7 గంటల నుంచి 28వ తేదీ సాయంత్రం 7 గంటలు వరకు నాలుగు రోజులు పాటు మూసి వేయబడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. కావున ప్రజలు, ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా ప్రయాణించి, సహకరించాలని కోరారు.

క్షీరారామలింగేశ్వరుని సేవలో అల్లూరి జిల్లా సబ్ కలెక్టర్


సబ్ కలెక్టర్ అభిషేక్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ వి.అభిషేక్ గురు వారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన సబ్ కలెక్టర్ అభిషేక్‌కు అధికారులు ముందుగా ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గణ పతి పూజ, క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లు, గోవుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసు సబ్ కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ సిబ్బంది గాంధీ, నాయుడు, అర్చకులు అనిల్, రెవెన్యూ ఆర్ఐ త్రిమూర్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 2012–13 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు గురువారం పాఠశాలకు బీరువాను అందించారు. పూర్వ విద్యార్థులు చందు, గణపతి, సాయి తదితరులు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ మూర్తిరాజుకు బీరువాను అందించారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

పెనుగొండ: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి అన్నారు. గురువారం సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

పార్టీ తరపున కార్మికులకు సేవలందించాలి


భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న గణేష్

సాక్షి, భీమవరం : వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాగ్రోజు గణేష్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంధ్రి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తరపున కార్మికులకు విస్తృత సేవలందించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని గణేష్‌కు సూచించారు. పార్టీ పటిష్టతకు అనుబంధ కమిటీలను నియమించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ వర్గాలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. క్షేత్రస్థాయిలో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారని, దానిలో భాగంగానే కార్మికుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదును జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు(తాతరాజు), ముల్లి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్రాజు కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ


సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

సాక్షి, భీమవరం : దివంగత ఉండి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు కుటుంబసభ్యులను గురువారం భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. స్థానిక ఆదర్శనగర్‌లోని సర్రాజు స్వగృహం వద్ద సర్రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. అనంతరం సర్రాజు కుమారులు వెంకట శ్రీనివాసరాజు (వాసు), యుగంధర్ నాగవర్మలకు తామంతా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు (తాతరాజు), తోట భోగయ్య తదితరులున్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

వీరవాసరం : బాలేపల్లి గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.15 వేల చొప్పున రూ.45 వేలు అందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, సర్పంచ్ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పేద కళాకారులకు రూ.లక్ష ఆర్థిక సహాయం


కళాకారులకు ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో సీఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 20 మంది పేద కళాకారులకు రూ.5 వేల చొప్పున రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా దాత డాక్టర్ సీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తన వంతు సహాయంగా తన సతీమణి స్వర్గీయ కమలమ్మ పేరిట భీమవరం పట్టణంలోని 20 మంది పేద కళాకారులకు రూ.5 వేలు చొప్పున అందించి సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు కనుమూరి సత్యనారాయణ రాజు, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు వబిలిశెట్టి కనకరాజు, వేగిరాజు విశ్వనాధరాజు, నిర్వాహకులు చెరుకువాడ సోదరులు వెంకట్రామయ్య, రంగసాయి, అలయన్స్ క్లబ్ వేగేశ్న రామ్మూర్తి రాజు, వేగేశ్న సీతారామరాజు, డాక్టర్ సీఎస్ఎన్ రాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయంపై ప్రచారం


ఉండిలో మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

ఉండి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా సాధారణ, మధ్య తరగతి ప్రజలకు, రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదని సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. గురువారం సీపీయం ప్రచార యాత్రలో భాగంగా ఉండి, కలిసిపూడి, చెరుకువాడ, అర్తమూరు, పాములపర్రు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయంపై కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ఎరువుల సబ్సిడీలో భారీ కోతలు విధించి రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. అలాగే బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గాని ప్రత్యేక హోదా విషయాన్ని ప్రక్కన పెట్టేశారన్నారు. ప్రజలు వద్దంటున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కేంద్రం ముందుకు వెళ్ళడం సమంజసం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు ధనికొండ శ్రీనివాస్, చీర్ల శేషు, కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, కడలి నాగేశ్వరావు,కట్టా రవి, చీర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రవాణా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆకివీడు: మోటార్ వెహికిల్, రవాణా నిబంధనల్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ ట్రాన్స్‌పోర్టు అధికారిణి ఎస్.సుబ్బలక్ష్మి హెచ్చరించారు. జిల్లా రవాణాధికారి ఆదేశాల మేరకు గురువారం స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో వాహనాల్ని తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసు నమోదు చేశారు. మరికొంత మందికి అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాల్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ రైడింగ్, ఆటోల్లో పరిమితి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకుని నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. మైనర్లను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఫిట్‌నెస్ వాహనాలు, ట్యాక్స్ చెల్లించని వాహనదారులు వెంటనే వాటిని చెల్లించి రోడ్డుపైకి తీసుకురావాలని సుబ్బలక్ష్మి సూచించారు. వాహనాల తనిఖీ నిరంతరం కొనసాగుతుందని, లైసెన్సులు లేని వారు వెంటనే పొందాలన్నారు. ఆయా వాహనాలకు లైసెన్సులు లేనివారు వెంటనే తీసుకోవాలని, లేనిపక్షంలో రూ.5 వేలు అపరాధ రుసుము తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్.వెంకటరమణ, ఏఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

సారా, డ్రగ్స్‌పై సమాచారమివ్వండి

పాలకోడేరు: భీమవరం ఎస్ఈబీ సీఐ వర్మ ఆధ్వర్యంలో పాలకోడేరు గ్రామ సచివాలయం-1 కార్యాలయంలో ఎస్సై ఎన్.శ్రీనివాసరావు మండలంలోని గ్రామ మహిళా పోలీసులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సారా, సుంకం చెల్లించని మద్యం కలిగి ఉన్నా, గంజాయి లేదా ఇతర డ్రగ్స్ ఎవరైనా అమ్ముతున్నా, బెల్టుషాపులు నిర్వహిస్తున్నా, పేకాట, కోడిపందేలు ఆడుతున్నా సమాచారం తెలియజేయాలని కోరారు. వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా పోలీసులు, ఎస్ఈబీ ఎస్సై బి.రాజేంద్రప్రసాద్, హెచ్‌సీ వై.శ్రీమన్నారాయణ, కానిస్టేబుల్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్


ఎండీ జహాంగీర్‌కు స్వీట్ తినిపిస్తున్న మదనీ

ఆకివీడు : అన్ని రంగాల్లో ముస్లిం మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. మదనీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఎండీ.జహాంగీర్‌ను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పార్టీకి కష్టపడి పనిచేస్తున్న ఎండీ.జహాంగీర్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించారని అన్నారు. ఇటీవల వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శిగా ఎండీ. సిద్దిక్‌ను నియమించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ముస్లింలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. ఉండి నియోజకవర్గంలోని ముస్లింలంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగా ఇస్తామని మదనీ చెప్పారు. జహాంగీర్‌ను అభినందించిన వారిలో వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి సిద్దిక్ ఉన్నారు.

పార్టీ విజయానికి కృషి చేస్తా


కరిమెరక రామచంద్రరావు

ఉండి : ఉండికి చెందిన కరిమెరక రామచంద్రరావు వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర అనుబంధ విభాగాల కన్వీనర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఈమేరకు గురువారం ఆయనకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఎంతో గొప్ప బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాధరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ విజయానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రామచంద్రరావు శుభకాంక్షలు తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


హెల్మెట్ ఉపయోగాలపై వివరిస్తున్న రూరల్ ఎస్సై డి. మోహన్‌రావు

భీమవరం అర్బన్ : ప్రమాదాలు చెప్పి రావని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్సై డి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని తాడేరు గ్రామంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై డి.మోహన్ రావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాప్రాయం నుంచి బయటపడవచ్చన్నారు. యువత మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ తమ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారికి తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా కుటుంబసభ్యులు చొరవ చూపాలన్నారు. అంతేకాకుండా హెల్మెట్ ధరించని వారికి చట్టపరంగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం 25 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లను అందించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్నారని వీఆర్వో ఫిర్యాదు

ఆకివీడు: మండలంలోని అయి భీమవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ సర్టిఫికెట్ ఇవ్వమని వేధిస్తున్నారని మండలంలోని అజ్జమూరు గ్రామానికి చెందిన వీఆర్వో జయరాజు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నాలుగు రోజులుగా గ్రామంలో భూమి లేకుండానే తన కుమార్తె పేరున సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భూమి లేకుండా పొజిషన్ సర్టిఫికేటు ఆమె పేరుని ఎలా ఇస్తామని చెప్పినందుకు గ్రామానికి చెందిన వేరొక వ్యక్తి ఫోన్ నుంచి తనకు ఫోన్ చేసి దుర్భాషలాడారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై ఎస్సై రాజారెడ్డిని వివరణ కోరగా ఇది సివిల్ మేటర్ కేసు నమోదు చేయడానికి వీలు లేదని చెప్పారు.

పాందువ్వలో పోక్సో కేసు నమోదు

ఉండి: ఏడాది నుంచి ప్రేమిస్తున్నానని నమ్మించి పెళ్లి చేసుకోవడానికి నిరాకరించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాందువ్వ గ్రామానికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన వీధి నవీన్ కుమార్ అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని ఏడాది నుంచి వెంట పడుతున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో కోరిక తీర్చుకున్నాడు. తీరా పెళ్ళి చేసుకోవాలని అడిగితే నిరాకరించాడు. అంతేకాకుండా ఆమెను చంపుతానని బెదిరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

సాక్షి, భీమవరం : వాహనం ఢీకొని ఓ మోటార్‌సైక్లిస్టు గాయపడ్డాడు. జేపీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని మరొక వాహనం ఢీకొట్టడంతో అతని తలకు గాయమైందని ఎస్సై పి.అప్పారావు తెలిపారు. బాధితుడు చికిత్స పొందుతున్నాడని, ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

సాక్షి, భీమవరం : పట్టణానికి చెందిన ఒక ప్రేమ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.అప్పారావు తెలిపారు. బాలిక చదువుకుంటున్న నేపథ్యంలో ఇప్పుడే వివాహం చేయమని తల్లిదండ్రులు చెప్పారని, దీంతో కంగారుపడి వారు పురుగుల మందు తాగినట్లుగా తెలుస్తోందన్నారు. ఇద్దరు చికిత్స పొందుతున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

ఆకివీడు: స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో గురువారం రాత్రి మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక తెలగపాములు కులానికి చెందిన నక్క రమేష్, పాల విక్రములు మద్యం తాగి హోటల్లో బిర్యాని తింటూ ఘర్షణ పడ్డారు. మద్యం సీసా, బ్లేడ్‌తో దాడి చేసుకున్నారు. గాయాలపాలైన వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరి వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితుల నుంచి ఎస్సై కే రాజారెడ్డి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖతార్‌లో ఆగర్తిపాలెం వాసి గుండెపోటుతో మృతి

పాలకొల్లు అర్బన్: ఉపాధి కోసం ఖతార్ దేశం వెళ్లి అక్కడ గుండెపోటుతో పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల జాన్‌కెనడీ(47) మృతిచెందారు. జాన్ కెనడీ గత పది సంవత్సరాలుగా ఖతార్ దేశంలో ఉపాధి పొందుతున్నారు. రెండేళ్ల క్రితం ఇండియాకి వచ్చి తిరిగి వెంటనే ఖతార్ వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోభారత కాలమాన ప్రకారం గత శనివారం మృతి చెందారు. జాన్ కెనడీ మృతదేహానికి ఖతార్ దేశంలో శవపంచనామా నిర్వహించి స్వస్థలమైన ఆగర్తిపాలెం గ్రామానికి గురువారం చేరుకుంది. టీసీఎఫ్ చర్చి పాస్టర్ ఓగూరి బుల్లబ్బాయ్, వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్, టీసీఎఫ్ ఎంసీ మెంబర్ నల్లి నాగేశ్వరరావు, చింతా శ్రీను తదితరులు ఖతార్‌లో ఉన్న జాన్‌కెనడీ మృతదేహాన్ని ఇండియాకి రప్పించడంలో పూర్తి సహకారం అందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

భీమవరం (ప్రకాశంచౌక్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. భీమవరం డిపో పరిధిలోని 5 మండలాలలో ఉన్న ప్రయాణికులు సెల్ నంబర్ 99592 25485కు ఫోన్ చేసి తమ సూచనలు, సలహాలు తెలియజేయాలని పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే జరిమానా తప్పదు


వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న అదనపు ఎస్పీ వి.సుబ్బరాజు

ఆకివీడు: హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాల్ని నడపడం ద్వారా క్షేమంగా గమ్యం చేరాలని అదనపు ఎస్పీ వి.సుబ్బరాజు హితవు పలికారు. జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో వాహనదారుల్ని తనిఖీ చేసి హెల్మెట్ వినియోగించని వారికి ప్రత్యేక సూచనలు చేశారు. వాహన ప్రమాదాల సమయంలో హెల్మెట్ రక్షణ కవచంగా ఉంటుందని చెప్పారు. వాహనాలు ఢీకొట్టినప్పుడు రోడ్డుపై పడిపోతే హెల్మెట్ తలకు దెబ్బ తగలకుండా రక్షిస్తుందన్నారు. వాహన ప్రమాదాల్లో అధిక శాతం తలకు గాయమై మరణించిన వారి శాతమే ఎక్కువ అన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే అపరాధ రుసుము చెల్లించక తప్పదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కే.రాజారెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడపై ఇక ప్రతీ రోజూ తనిఖీలు చేస్తామని చెప్పారు. నిరంతర తనిఖీలతో అపరాధ రుసుములు చెల్లించాల్సి వస్తుందన్నారు. వెంటనే హెల్మెట్ కొనుగోలు చేసుకోవాలని సూచించారు.